క్లుప్తంగా

ఆలయానికి విరాళం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం దేవునిపల్లి కాకతీయనగర్ కాలనీలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన భోగ నవీన్ కుమార్ మంగళవారం రూ.50,116లు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగయ్యచారి, ప్రతినిధులు భూలక్ష్మణ్‌చారి, లక్ష్మీకాంతంచారి, రవీందర్‌చారి పాల్గొన్నారు.

తిప్పాపూర్‌లో..



భిక్కనూరు: తిప్పాపూర్‌లో పాకనాటి రెడ్డి యువజన సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు భీంరెడ్డి రూ.35 వేలను విరాళంగా అందజేశారు.

ప్రజావాణి దరఖాస్తుపై ఎంపీవో విచారణ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బంజరతండా గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన ఇంటి నిర్మాణానికి సంబంధించి ఇటీవల జిల్లాకేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుపై సోమవారం స్థానిక ఎంపీవో శ్రీనివాస్ విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా ఫిర్యాదులో పేర్కొన్న ఇంటి నిర్మాణాన్ని సర్పంచ్ అరుణతోపాటు గ్రామస్తులతో కలిసి ఆయన పరిశీలించారు. దీంతోపాటు జీపీ కార్యాలయంలో పలు రికార్డులను ఆయన పరిశీలించారు. విచారణకు సంబంధించిన నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆయన చెప్పారు. పంచాయతీ కార్యదర్శి మమత ఉన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా రాజనర్సాగౌడ్



దోమకొండ: దోమకొండ గౌడ సంఘం అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన బొంబోతుల రాజ నర్సాగౌడ్ ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక రేణుకామాత ఎల్లమ్మ ఆలయంలో జరిగిన గౌడ సంఘం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా శ్యాంసుందర్‌గౌడ్, కార్యదర్శిగా వెంకట్‌గౌడ్, కోశాధికారిగా శ్రీకాంత్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు. అదే విధంగా ఎల్లమ్మ గుడి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా తీగల నాగభూషణం గౌడ్, ఉపాధ్యక్షుడిగా నర్సాగౌడ్, కార్యదర్శిగా రవిగౌడ్, కోశాధికారిగా యాదగిరిగౌడ్‌లు ఎన్నికయ్యారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



బాన్సువాడ: బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అంతకుముందు సాంబాపూర్‌లో ఇటీవల మృతి చెందిన ఇద్దరు యువకుల కుటుంబ సభ్యులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం చేశారు. బీఆర్‌ఎస్ యువజన నాయకులు శశికాంత్, విఠల్, కర్ణం నవీన్, చాకలి కళ్యాణ్, గంగాధర్, రాము, సాయిలు, అంజయ్య, నవీన్, యోగి, హన్మండ్లు తదితరులు ఉన్నారు.

ఎల్‌వోసీల పంపిణీ



కామారెడ్డి క్రైం: అనారోగ్య కారణాలతో కామారెడ్డి నియోజకవర్గంలోని ముగ్గురు వ్యక్తులు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి వైద్య చికిత్సల నిమిత్తం రూ.3.80లక్షల విలువైన ఎల్‌వోసీలను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మంజూరు చేయించి కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. దోమకొండకు చెందిన షేక్ అన్సార్ అలీకి రూ.80వేలు, మాచారెడ్డి మండలం బండ రామేశ్వర్‌పల్లికి చెందిన లక్ష్మీనర్సయ్యకు రూ.1.50 లక్షలు, బీబీపేట మండలం మాందాపూర్‌కి చెందిన సుజాతకు రూ.1.50 లక్షల విలువైన ఎల్‌వోసీలను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మంగళవారం హైదరాబాదులోని తన నివాసంలో అందజేశారు.



సదాశివనగర్ రెడ్డి గణేశ్ మండపం వద్ద పూజలు



జిల్లా కేంద్రంలో కారుపై వినాయకుడి ఊరేగింపు



జిల్లా కేంద్రంలోని పెద్ద బజార్‌లో చంద్రయాన్-3 వినాయకుడు



బీబీపేటలో గణపతులను మండపాలకు తరలిస్తున్న భక్తులు



రాజంపేటలో ..



భిక్కనూరులో విగ్రహాలను ఇళ్లకు తీసుకెళ్తున్న ప్రజలు



కోడిచిరలో మట్టి గణపతిని ప్రతిష్టించడానికి వెళ్తున్న కుటుంబం



గోర్గల్‌లో పూజలో పాల్గొన్న ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి



లడ్డూలను పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు



తాడ్వాయిలో..



జిల్లా పోలీస్ కార్యాలయంలో పూజలు చేస్తున్న ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి దంపతులు



గోపాల్‌పేటలో సాయినాథ్ యూత్ ఆధ్వర్యంలో..

కొలువుదీరిన గణనాథులు

జిల్లాలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభోపేతంగా ప్రారంభమయ్యాయి. భాజాభజంత్రీలతో ఊరేగింపుగా వినాయక విగ్రహాలను మండపాల వద్దకు తీసుకువచ్చారు. ప్రత్యేక పూజలు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించారు. 11 రోజుల పాటు వినాయకుడు పూజలను అందుకోనున్నాడు. జిల్లా కేంద్రంలోని పెద్దబజార్‌లో చంద్రయాన్-3 వినాయకుడు ఆకట్టుకుంటున్నాడు.

ఇళ్లలో ప్రజలు వినాయక చవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. మొదటి రోజు పలువురు ప్రముఖులు వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గణపతి బప్పా మోరియా అంటూ మండపాలు మారుమ్రోగాయి.

– సాక్షి నెట్‌వర్క్



దోమకొండలోని మార్కండేయ మందిరం వద్ద జరిగిన వినాయక ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు



రామారెడ్డిలో సైకిల్‌పై తెస్తున్న చిన్నారులు



ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



బాన్సువాడలో గణపతులు పంపిణీ చేస్తున్న భాస్కర్‌రెడ్డి



లింగంపేట: రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో..



పిట్లంలో..

125 కుటుంబాలకు దళిత బంధు ఇవ్వాల్సిందే!

కామారెడ్డి అర్బన్: పిట్లం మండలం చిల్లర్గి గ్రామంలోని 125 దళిత కుటుంబాలకు దళిత బంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బి.బాలరాజు మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గంలో చిల్లర్గిలో 125 దళిత కుటుంబాలుండగా కేవలం బీఆర్‌ఎస్‌కు చెందిన 15 కుటుంబాలకు మాత్రమే దళిత బంధు అందజేశారని, అర్హులైన 125 కుటుంబాలకు ఇవ్వాలని ఎమ్మెల్యే హన్మంత్ సింధేను డిమాండ్ చేస్తున్నామన్నారు. పార్టీ జిల్లా కోశాధికారి హరిలాల్‌నాయక్, చిల్లర్గి దళితులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న చిల్లర్గి దళితులు

కాంగ్రెస్ చెప్పిందే చేస్తుంది

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డిరూరల్: కాంగ్రెస్ పార్టీ చెప్పిందే చేస్తుందని, చేసేదే చెప్తుందని కాంగ్రెస్ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి అన్నారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో, ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో సోమవారం జహీరాబాద్ పార్లమెంట్ నియోజవర్గ పరిశీలకులు సీడీ మయ్యప్పన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అమలు చేయబోయే గ్యారెంటీ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొని పదేళ్లవుతున్నా నిరుపేద కుటుంబాలు డబుల్‌బెడ్ రూం ఇళ్లకు నోచుకోలేకపోతున్నారని అన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువవికాసం, చేయూత పథకాలను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ధనుంజయ్, జెడ్పీ ఫ్లోర్ లీడర్ మోహన్ రెడ్డి, ఎల్లారెడ్డి వైస్‌ఎంపీపీ నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



గ్యారంటీ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తున్న సుభాష్‌రెడ్డి

ఇంటింటి ప్రచారం నిర్వహించాలి

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాల గురించి కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సీడీ మయ్యప్పన్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్ రెడ్డితో పాటు కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాలతో అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

దివ్యాంగ కళాకారుడికి వాహనం అందజేత

బాన్సువాడ రూరల్: దివ్యాంగుడైన జానపద, నృత్య కళాకారుడు రవినాయక్‌కు మంగళవారం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తన సొంత డబ్బులతో త్రిచక్ర వాహనాన్ని అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిలు వాహనం తాళం చెవిని దివ్యాంగుడికి వారి చేతులమీదుగా ఇచ్చారు. నాయకులు మోహన్‌నాయక్, సంగ్రాం నాయక్, గోపాల్‌రెడ్డి, అంజిరెడ్డి, ఎజాస్, నారాయణరెడ్డి, బోర్లం రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి వాహనం అందిస్తున్న మంత్రి, స్పీకర్

వినాయకుడికి పూజలు

బాన్సువాడ: వినాయక చవితి పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి స్పీకర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి దంపతులు ఉన్నారు.

జంగమ కార్యవర్గ సమావేశం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్ మల్లన్నగుట్ట వద్ద మంగళవారం జిల్లా జంగమ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు జంగం ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్, కో-కన్వీనర్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో బీసీ ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రేవంత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాగభూషణం, భైరయ్య, వీరభద్రప్ప, ప్రభుదేవ్, దిలీప్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని ఏర్పాటు చేయాలని వినతి



గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి మండలంలో మొండిసడక్ కేంద్రంగా మరో మండలాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానం కాపీని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్‌కు మంగళవారం మండల ప్రజాప్రతినిధులు అందజేశారు. ఎంపీపీ రాధా బలరామ్ నాయక్ అధ్యక్షతన ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన మండలం ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. జెడ్పీటీసీ శంకర్ నాయక్, గాంధారి సర్పంచ్ సంజీవు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం దీక్షలు

కామారెడ్డి టౌన్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు దీక్ష చేపట్టారు. 20 సంవత్సరాలుగా పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి పద్మారావు, జిల్లా కన్వీనర్ పురుషోత్తం, తదితరులున్నారు.

'ముదిరాజ్‌లను విస్మరిస్తే ఊరుకునేదిలేదు'



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘ సభ్యులు

రాజంపేట: ముదిరాజ్‌లకు అన్ని పార్టీలు సీట్లు కేటాయించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి అబ్రబోయిన స్వామి ముదిరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ముదిరాజ్ ర్యాలీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ముదిరాజులను విస్మరించిన ముఖ్యమంత్రికి గుణపాఠం చెప్తామన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ దీక్షను విరమించే సమయంలో ఉద్యమాన్ని కొనసాగించాలని తన సర్వీస్ వారితో కాల్చుకొని అమరుడైన కానిస్టేబుల్ కిష్టయ్య, ముదిరాజ్ అని కేసీఆర్ గుర్తుంచుకోవాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 మంది ముదిరాజులు తెలంగాణ ఉద్యమంలో బలయ్యారని పేర్కొన్నారు. అలాంటి మా జాతికి బీఆర్‌ఎస్ ఒక్క ఎమ్మెల్యే టికెట్ కేటాయించకుండా జాబితాని విడుదల చేస్తూ ఎన్నికలకు పోవడం దారుణమని పేర్కొన్నారు. మా ఆత్మగౌరవానికి భంగం కలిగిందని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి ముదిరాజ్ ఇంటి నుంచి ఇద్దరు చొప్పున తరలిరావాలని పిలుపునిచ్చారు. లక్ష మందితో కామారెడ్డిలో భారీ ర్యాలీ నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామ ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు బండారి చంద్రయ్య, కార్యదర్శి గజ్జెల రాజు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

సమాచారహక్కు చట్టాన్ని వినియోగించుకోవాలి

- స.హ చట్టం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెగ్గేల రాజు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సమాచారహక్కు(స.హ) చట్టాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని స.హ చట్టం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెగ్గేల రాజు సూచించారు. తాండూర్ హైస్కూల్‌లో మంగళవారం స.హ చట్టం-2005పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స.హ చట్టం సామాన్యుల చేతిలో వజ్రాయుధంలాంటిదన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా స.హ చట్టం బోర్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చట్టంలోని సెక్షన్-6(1) ప్రకారం దరఖాస్తు చేసుకుంటే 30 రోజులలో సమాచారం అందించాలన్నారు. నిర్ణీత సమయంలో సమాచారం ఇవ్వకపోతే కమిషనర్‌కు అప్పీల్ చేసుకోవాలని చెప్పారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లెగ్గేల రాజు

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

లింగంపేట(ఎల్లారెడ్డి): బాల్య వివాహల నిర్మూలనపై కోమట్‌పల్లిలో మంగళవారం సాధన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సతీష్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు లేని భారత దేశాన్ని నిర్మించడం కోసం సాధన సంస్థ వారు గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు తెలిపారు. పిల్లలతో వెట్టి చాకిరి చేయించినా నేరంగా పరిగణిస్తారని తెలిపారు. బాలల అక్రమ రవాణా జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్నారు. పిల్లలపై లైంగిక వేధింపులు జరిపినా, బాలలతో పనిచేయించినా, బాల్య వివాహాలు చేసినా, చదువు మధ్యలో మానేసిన, తప్పిపోయిన పిల్లలు, ఇంటి నుంచి పారిపోయిన పిల్లలు కనపడితే సాధన సంస్థ ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. 18001027222, 1098 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.



అవగాహన కల్పిస్తున్న సాధన సంస్థ ప్రతినిధులు

సంక్షిప్తం

లైటింగ్ ఏర్పాటు

లింగంపేట(ఎల్లారెడ్డి): అయిలాపూర్‌లో గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీటీసీ దేవేందర్ సంయుక్తంగా సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఎల్లమ్మ, హనుమాన్ ఆలయాల వద్ద సెంటర్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. రూ.1.90 లక్షలు ఖర్చయినట్లు తెలిపారు. ఉపసర్పంచ్ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

లింగంపేట(ఎల్లారెడ్డి): కంచుమల్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సోమవారం ముదాం సాయిలు భూమి పూజ చేశారు. ఆదర్శప్రాయుడు అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతీ ఒక్కరూ నడుచుకోవాలని ఆయన సూచించారు. కొండాపూర్ సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు సర్వన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేసినట్లు ఆరోగ్య కేంద్రం వైద్యుడు రోహిత్ చెప్పారు. ఆరోగ్య కార్యకర్త పర్హానా ఉన్నారు.

స్వల్పకాలిక రైతుల రుణమాఫీ

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఉన్న రైతుల స్వల్పకాలిక రుణాలు మాఫీ అయ్యాయని సంఘం చైర్మన్ హన్మంత్ రెడ్డి తెలిపారు. అనంతరం రుణమాఫీ అయిన లబ్ధిదారులకు చెక్కులను అందేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తిర్మల్ రెడ్డి, బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఖండేరావు, తదితరులు ఉన్నారు.

ప్రకృతి వనంలో పాముల కలకలం

రాజంపేట: ఆర్గొండ గ్రామ పల్లె ప్రకృతి వనంలో పాములు కలకలం సృష్టించాయి. అకాల వర్షాల కారణంగా పల్లె ప్రకృతి వనంలో గడ్డి బాగా పెరగడంతో ఇవాళ గ్రామ పంచాయతీ సిబ్బంది శుభ్ర పరిచేందుకు వెళ్లారు. గడ్డిని తీసే సమయంలో ఒకేసారి కుప్పల కొద్దీ పాములు బయటకి రావడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన పారిశుద్ధ్య కార్మికులు కర్రలతో పాములను కొట్టి చంపారు. సిమెంటు బెంచీల కింద సుమారు 20 పాములను గుర్తించి చంపారని పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. వేరు చేసిన తడి, పొడి చెత్తను ఇంటి ముందుకు వచ్చే చెత్త బండికి ఇవ్వాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడవేయవద్దన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, మండల కో-ఆప్షన్ అల్తాఫ్, తదితరులు పాల్గొన్నారు.

15వరోజుకు చేరిన కాంట్రాక్టు అధ్యాపకుల దీక్షలు

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరసన దీక్షలు 15వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని లేకుంటే త్వరలోనే పెన్ డౌన్ సమ్మె నిర్వహిస్తామని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నారాయణ గుప్తా అన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులు యాలాద్రి, సునీత, నరసయ్య, రమాదేవి, పాల్గొన్నారు.